క్లుప్తంగా

నేటి నుంచి లోక్ అదాలత్

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో శుక్రవారం నుంచి మార్చి 8వ తేదీ వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ తగాదాలు, వాహన ప్రమాదాలు, చిన్న చిన్న గొడవలు, భార్యాభర్తల విభేదాలు వంటి కేసులను రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించి కోర్టు కొట్టివేయబడుతుందని పేర్కొన్నారు. వివరాలకు బిజినేపల్లి కోర్టు కానిస్టేబుల్ చిన్నునాయక్ సెల్: 9440170050 సంప్రదించాలని కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ



చారకొండ: మండలంలోని జూపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్‌లో గాంధీజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థిని, విద్యార్థులకు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు, మాజీ సర్పంచ్ బాలేమియా సహకారంతో యువజన సంఘం అధ్యక్షుడు నాయిని పరంజ్యోతి విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తాడూరు: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేందర్ సూచన మేరకు ప్రపంచ చెస్ ఛాంపియన్ సాధించిన హౌతఃపస్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. మండలంలోని గుంతకోడురు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు ప్యాడ్స్, స్కిప్పింగ్ మెటీరియల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్ రెడ్డి, క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ఖాజా, ప్రతినిధులు సాయిబాబా, సుమతి, శిల్ప, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చారకొండ: జూపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని జూపల్లి, తిమ్మాయిపల్లి, కమాల్‌పూర్, సారం బండ తండా, జేపల్లి, దొడ్లపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గురువారం ఏఈ జానకిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలని జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్ దారమోని కోరారు. గురువారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్ కర్నూల్‌లో బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదయ్య, శివ, విష్ణు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు

వెల్దండ: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటునట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. గురువారం గుండాలతో పాటు పలు గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

చికెన్ మేళాకు విశేష స్పందన

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం సాయంత్రం చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహ చికెన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఏజీఎం జి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ 70 డిగ్రీల సెల్సియస్ వేడిలో చికెన్‌ను ఉడికించి తింటే ఎలాంటి వైరస్ ఉండదన్నారు. కార్యక్రమంలో స్నేహ చికెన్ నిర్వాహకులు ప్రవీణ్, చికెన్ సెంటర్ల యజమానులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బారిగారి లక్ష్మమ్మ కుమారుడు బారిగారి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను గురువారం సాయంత్రం పరామర్శించారు. కార్యకర్తలు సత్యనారాయణ, రాములు పాల్గొన్నారు.

పక్కా భవనాలు లేక పరేషాన్



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- అద్దె భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు

కోడేరు: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలు ఇరుకు గదుల్లో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శాఖలకు సంబంధించిన రికార్డులు ఎక్కడ భద్రపర్చాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇందిరాక్రాంతి పథకం (వెలుగు కార్యాలయం) కొన్నేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. మండలం ఏర్పాటు అయిన నాటి నుంచి తహసీల్దార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. బీసీ హాస్టల్ భవనం కూడా కొన్నేళ్ల నుంచి అద్దె భవనంలో సాగుతోంది. జిల్లా అధికారులు కార్యాలయానికి సంబంధించిన విలువైన సామాగ్రి భద్రపర్చేందుకు అవసరమైన గదులు లేవు. వెలుగు కార్యాలయానికి గ్రామాల నుంచి వచ్చే గ్రామసంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించేందుకు అనువైన గదులు లేక ఇబ్బందులు పడుతూ వరండాలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారుల అలసత్వం వల్ల ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినా వెనక్కి వెళ్లిపోయాయి.



నిలిచిన బీసీ హాస్టల్ భవన నిర్మాణం

నిలిచిన పనులు

ఐకేపీ భవన నిర్మాణానికి తొమ్మిదేళ్ల కిందట రూ.30 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. స్లాబ్ వేసి చుట్టు గోడలు నిర్మించి వదిలేశారు. కోర్టు పరిధిలో ఉండటంతో భవన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాలయానికి గతేడాది డిసెంబర్‌లో రూ.1.70 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అప్పట్లో శంకుస్థాపన చేసి అలాగే వదిలేశారు. తహసీల్దార్ కార్యాలయానికి అనువైన చోట నిర్మాణం చేపట్టడం లేదని గ్రామస్తులు పనులు నిలిపివేశారని అధికారులు పేర్కొంటున్నారు. హాస్టల్ భవనానికి 15 ఏళ్ల కిందట నిధులు మంజూరు అయిన పిల్లర్ల వరకే పరిమితం అయ్యింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. పాలనా పరంగా అధికారులకు వివిధ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ భవనం ఉంటే అధికారులు సమావేశాల నిర్వహణకు సామాగ్రి భద్రపర్చేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

– యాపచెట్టు లాలు, బీఆర్‌ఎస్ నాయకుడు, కోడేరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



మండల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మించేందుకు పూర్తి వివరాలు సేకరిస్తాం. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్కా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యేలా చేస్తా.

– శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ, కోడేరు

చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

మన్ననూర్: చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవి కుమార్ అన్నారు. గురువారం అమ్రాబాద్ మండలం మన్ననూర్, వటువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు దోమలపెంట, ఈగలపెంట ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని చిన్నారులందరికి వ్యాధి నిరోధక టీకా తప్పకుండా వేయాలని సూచించారు. పీహెచ్‌సీలో నిల్వ ఉన్న వ్యాక్సిన్‌లు, ఓపీ సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో యాదగిరి, అబ్దుల్ సలీమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అధికారి డాక్టర్ రవి కుమార్

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

పెద్దకొత్తపల్లి: మహిళలు ఆర్థిక అక్షరాస్యతలో సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జిల్లా లీడ్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. తిర్మలాపూర్‌లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై సమవేశం నిర్వహించారు. మహిళ సంఘాల ద్వారా పొదుపులో సాధించిన ఘనత అనే అంశంపై టీజీ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలలో తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం సురక్షితంగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో టీజీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ సత్యం, వెంకటేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

కల్వకుర్తి: బీఆర్‌ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ దగ్గరికి వెళ్తున్నారని విమర్శించారు. టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిజాయితీతో ప్రయత్నిస్తుందన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, నేషనల్ రిమోటింగ్ సెన్సింగ్ ఏజెన్సీ, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆర్మీ, నేవీ మార్కోస్ కమాండోస్ తదితర సంస్థలు, కంపెనీల భాగస్వామ్యంతో చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయ లబ్ధి కోసం హరీశ్ రావు బృందం టన్నెల్‌కు రావడం సరికాదన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన దుర్ఘటనను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే దుర్బుద్ధితో బీఆర్‌ఎస్ వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్మల శ్రీకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చంద్రకాంత్ రెడ్డి, రాహుల్, గణేష్ యాదవ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాయతి విజయకుమార్ రెడ్డి

దళితబంధు నిధులు విడుదల చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్: దళితబంధు నిధులు విడుదల చేయాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వారు నిరసన తెలిపారు. రెండో విడత దళితబంధు యూనిట్లను వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు దేవని కుమార్, కలమంద శేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 1100 మంది లబ్ధిదారులకు రెండో విడత దళితబంధు యూనిట్లు మంజూరుచేసి, వాటికి సంబంధించిన నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బులు విడుదల చేయలేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల అకౌంట్లలో జమచేసిన డబ్బులను వెనక్కి తీసుకొని ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండో విడత దళితబంధు యూనిట్ల డబ్బులను వెంటనే లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. దారా శేఖర్, మల్లెల సుధాకర్, శీలం వెంకటస్వామి, ఎం.కుమార్, కోళ్ల శంకర్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆయ గ్రామాలలో నిర్వహించిన వివిధ పనులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయులు అధ్యక్షతన గురువారం గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 2023–24 సంవత్సరం గాను చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. గ్రామాలలో చేపట్టిన పనులను పరిశీలించి జరిగిన అవకతవకలను గ్రామసభల్లో వెల్లడించారన్నారు. 24 గ్రామ పంచాయతీల సమాచారాన్ని అధికారులు రూ.30 వేలకు సంబంధించి ప్రణాళిక ప్రకారంగా పనులు లేకపోవడంతో విధాన పరమైన జరిమానాలు విధించారు. పనులు సక్రమంగా లేకపోవడంలో రూ.16 వేల రికవరీకి ఆదేశించారు. బహిరంగ సభలో ప్రిసైడింగ్ అధికారి, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, క్వాలిటీ అధికారి కృష్ణారావు, అంబుడ్స్‌మెన్ జంగయ్య, ఎస్‌ఆర్పీ నర్సయ్య, విజిలెన్స్ అధికారి రాజుతో పాటు ఆయ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండలంలోని శాయిన్‌పేట, బాకారం, మాడాపూర్ పాఠశాలలను గురువారం విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడీని జనరేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలను అభివృద్ధి చేయాలి

తాడూరు: దళితవాడల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ నిధులను కేటాయించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో అంటరాని తనం నిర్మూలన కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. 10, 11, 12వ తేదీల్లో మూడు రోజుల పాటు వేములవాడలో రాష్ట్ర స్థాయి డీహెచ్‌పీఎస్ విస్తృత సమావేశాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, బంగారయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల రథోత్సవం



రథాన్ని లాగుతున్న యువకులు



డప్పు ప్రదర్శన నిర్వహిస్తున్న కర్ణాటక కళాకారులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పల్లె నాగరాజు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం తేరు మహోత్సవం వైభవంగా కొనసాగింది. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను రథంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. రథం ఎదుట కళాకారులు నృత్యాలు చేస్తూ, బొడ్డెమ్మలు ఆడుతూ అలరించారు. అంతేకాకుండా కేరళ, కర్ణాటక, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి కళాకారులు ప్రత్యేకంగా వచ్చి భక్తిగీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మహిళలు కోలాటాలు, జడకోలాటాలు, బొడ్డెమ్మలు ఆడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లె నాగరాజు, రిటైర్డ్ ఎంఈఓ సత్యం, మాజీ సర్పంచ్ రాజేష్, ఎస్‌ఐ రామన్‌గౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం ఉమామహేశ్వర స్వామి పూర్ణాహుతి, బలిహరణ, నివేదన, మహా మంగళహారతి, పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకులు జంగం శివయ్య తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పూజలు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అదనపు కలెక్టర్ అమరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులకు పూజలు చేసి అభిషేకం చేశారు. దేవాలయ ఉత్సవ కమిటీ అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. అనంతరం గుండాల కోనేరులో గల్లంతైన విద్యార్థికి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో సహాయక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, నాయకులు పర్వత్‌రెడ్డి, డీటీ శ్రీను, తదితరులు ఉన్నారు.

కరపత్రాలు విడుదల



నాగర్‌కర్నూల్‌రూరల్: మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో వచ్చే నెల 2, 3 తేదీలలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహిస్తునట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పేర్కొన్నారు. దీనికి సంబంధించి గురువారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. సమావేశాలకు దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బాలస్వామి, నిరంజన్, కృష్ణ, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

ఉప్పునుంతల: భూమిలేని పేదలందరికీ ఏడాదికి రూ. 12 వేలు ప్రభుత్వం అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ పనులు లేనందున మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. సమావేశంలో వ్యకాస నాయకులు ఉస్సేన్, కొండల్, శేఖర్, లింగస్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు

తిమ్మాజిపేట: మండల కేంద్రం తిమ్మాజిపేట సమీపంలో స్వయంభుగా వెలిసిన శివలింగానికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపాటి రాతి కట్టడం(గుడి)లో15 ఏళ్లుగా శివరాత్రి మరసటి రోజు శివలింగానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ అని నిర్వాహకులు తెలిపారు. వట్టల శ్రీనుయాదవ్ మిత్ర బృందం అన్నదానం చేశారు. విష్ణు, రాజు, శేఖర్, శివ, కావలి శివ, సందీప్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన నాయకులు

వెల్దండ: శ్రీశైలంలోని ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు బృందానికి గురువారం మండల కేంద్రంలో నాయకులు కలిసి స్వాగతం పలికారు. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడు, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లను సన్మానించారు. మండల నాయకులు రాంరెడ్డి, వెంకటయ్యగౌడు, శేఖర్, నిరంజన్, ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



తెలకపల్లి: విద్యార్థులకు పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీ రీయింబర్స్‌మెంటును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యక్షుడిగా తిరుపతి, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అరవింద్ సహాయ కార్యదర్శిగా చరణ్, శ్రీకాంత్‌తో పాటు మరో 12మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

1న వేలం పాట

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సీతారామచంద్రాస్వామి దేవస్థానంలో ఏప్రిల్‌లో నిర్వహించే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు కొబ్బరికాయలు, కొబ్బరి ముక్కలు, తలనీలాలు, లడ్డు, పులిహోర ప్రసాదాలకు సంబంధించి మార్చి 1న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ధేరం రామ శర్మ, ఈఓ అంజనేయులు గురువారం ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయ, ధర్మ దాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహిస్తునట్లే పేర్కొన్నారు. ఔత్సాహికులు కొబ్బరికాయలకు రూ. 5లక్షలు, తలనీలాలకు రూ.లక్ష, కొబ్బరి ముక్కలకు రూ. 50 వేలు లడ్డు, పులిహోర ప్రసాదాలకు రూ. 2లక్షలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

భక్తి భావంతో మెలగాలి

కల్వకుర్తి రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని టాస్క్ సీఓఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వెంకటాపూర్‌లో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు, అనిల్ గౌడ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర సమీపంలో ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులు శ్రీశైలం దర్శనం చేసుకుని తిరిగి హైదరాబాద్ వెళ్తు ఓమ్ని వ్యాన్‌లో వస్తున్నారు. మాడుగుల చెందిన వాసుదేవ్ యాదవ్ కుటుంబ సభ్యులు కారులో అచ్చంపేట వెళ్తు వెళ్తున్నారు. తాండ్ర సమీపంలో ఓమ్నీ వ్యాన్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓమ్నీ వ్యాన్‌లో వస్తున్న మల్లేష్, అనురాధ, మంజునాథ్, తక్ష, మోగులప్పలతో పాటు కారులో ప్రయాణిస్తున్న వాసుదేవ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

వృద్ధురాలిని కుమారుడికి అప్పగింత



పెంట్లవెల్లి: చిన్నంబావి మండలం పెద్దమారు గ్రామానికి చెందిన వృద్ధురాలు గోవిందమ్మ మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతోంది. గమనించిన పోలీసులు వృద్ధురాలు వివరాలను అడిగి తెలుసుకొని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వృద్ధురాలు కుమారుడు, కోడలును పిలిచి వారికి వృద్ధురాలిని అప్పగించారు. రాజన్‌గౌడ్, మోహన్, విష్ణుమూర్తులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బైక్ అదుపుతప్పి మైనర్లకు తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: బైక్ అదుపుతప్పి మైనర్లకు తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్‌పై మైనర్లు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వివిధ స్టంట్లు చేస్తూ అతివేగంతో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ఎదురుగా నిలిపి ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు మైనర్లు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ అడగగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.